క్లుప్తంగా

నాణ్యతలో రాజీపడవద్దు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: రైతులకు అవసరమైన ఉత్పాదకాల పంపిణీ, విక్రయాల నాణ్యతలో రాజీపడకుండా అధికారులు చట్టాలను అమలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో వ్యవసాయాధికారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని వ్యవసాయాధికారులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులపై శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల చట్టాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర సెక్రటరీ ప్రవీణ్, కర్నూలు ఏడీఏ వెంకటేశ్వర్లు, కమిషనర్ కార్యాలయ ఏడీఏ రాజన్, అమలాపురం ఏడీఏ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు


మోరంపూడి జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో మోరంపూడి జంక్షన్‌లో అంతర్గత రహదారిపై కాంక్రీటు, ఇతర పనులు చేపట్టారు. ఈ పనులతో ద్విచక్ర వాహనాలు, ఆటోలను పక్కన ఉన్న ఖాళీలో నుంచి వెళ్లనిస్తున్నారు. శాటిలైట్‌సిటీ నుంచి వచ్చే కార్లు, లారీలు, భారీ వాహనాలను సాయినగర్ దుర్గ గుడి నుంచి గాదాలమ్మ పుంత రోడ్డు మీదుగా నిమ్మకాయల మార్కెట్ దగ్గర నుంచి హైవే మీదుగా పంపిస్తున్నారు. వీఎల్ పురం నుంచి వచ్చే వాహనాలను బ్యాంకు కాలనీ, ఐఎల్‌టీడీ మీదుగా కవలగొయ్యి జంక్షన్‌కు మళ్లిస్తున్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావు నేతృత్వంలో ట్రాఫిక్, బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.

29న 5కే రన్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లాలో యువతకు హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్టివల్ ఈ నెల 29న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తూర్పు గోదావరి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టీబీ నియంత్రణ అధికారి ఎన్. వసుంధర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న నిర్వహించే యూత్ ఫెస్టివల్‌లో భాగంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థిని/విద్యార్థులకు ట్రాన్స్‌జెండర్లతో 5కే రన్ నిర్వహిస్తున్నామన్నారు. ఐదు కిలో మీటర్ల మారథాన్ ఉదయం 6.30కు రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి గోదావరి నదీ తీరాన ఉన్న ఇస్కాన్ టెంపుల్ వరకూ వయా నందం గనిరాజు జంక్షన్, కంబాలచెరువు, దేవీచౌక్, గోకవరం బస్టాండ్, మున్సిపల్ పార్క్, పుష్కర ఘాట్, గోదావరి బండ్ మీదుగా సాగుతుందన్నారు. విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ఇస్తామన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు 29వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు టీబీ శాఖాధికారి వారి కార్యాలయంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. ఈ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 95815 31960, 99494 95022 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

వచ్చే నెల 8 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

ప్రకాశంనగర్: సెప్టెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకూ నేషనల్ మెగా బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు సిటీ ఎమ్మెల్యే, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక నారాయణపురం ఆర్ఎంసీ ఇండోర్ షటిల్ కోర్టులో మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జాతీయ క్రీడాకారులు వస్తారని చెప్పారు. రెండు దశాబ్దాల తర్వాత నిర్వహించే ఈ టోర్నమెంట్‌కి పార్టీలకతీతంగా పెద్దలు రావాలని కోరారు.

26 నుంచి క్రీడా సంబరాలు

ప్రకాశంనగర్: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం పేరిట జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 26 నుంచి క్రీడా సంబరాలను నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంబరాల్లో భాగంగా 26న జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు, కళాశాలల్లో క్రీడాకారులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 27న 18 నుంచి 60 ఏళ్ల క్రీడాకారులకు వివిధ క్రీడా పోటీల నిర్వహణ, 28న పిల్లలకు క్రీడా పోటీల నిర్వహణ, 29న 3కే ర్యాలీ నిర్వహణ, అత్యుత్తమ క్రీడాకారుల సన్మానం, 30, 31న వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా క్రీడా ఐక్యత, సృజనాత్మక, క్రీడా చిత్రాలు, లఘుచిత్రాలు, వ్యాసరచన, చిత్ర కళల ప్రదర్శన ఉంటుందన్నారు.

సమాజంలో మార్పు రావాలి



మహిళల విషయంలో సమాజంలో మార్పు రావాలి. ముఖ్యంగా ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యుల పట్ల ఇలాంటి క్రూరమైన ఆలోచనలు రావడం బాధాకరం. ప్రభుత్వాసుపత్రిల్లో పనిచేసే వైద్యులకు భద్రత కొరవడింది. ఆసుపత్రుల్లో మంచి వాతావరణం ఉంటే మహిళా వైద్యులు మరింత వేగంగా పనిచేస్తారు. అదే స్థాయిలో వైద్య సేవలందించేందుకు మానసికంగా బలంగా ఉంటారు. ఆ పరిస్థితులను కల్పించాలి. మహిళా వైద్యులు మానసికంగా దృఢంగా ఉంటేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి.

-బి.మౌనిక, పీహెచ్‌సీ వైద్యుల జిల్లా సంఘం అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం



పూర్తి భద్రత ఉంటేనే..



ఆసుపత్రుల్లో పటిష్ట భద్రత కల్పిస్తేనే నిర్భయంగా విధులు నిర్వహించగలం. కోల్‌కతా ఘటన మహిళా డాక్టర్లను ఆందోళనకు గురిచేస్తుంది. పీహెచ్‌సీల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘా పెట్టాలి. వైద్యులు ప్రశాంతంగా వైద్య సేవలందించేందుకు భరోసా కల్పించాలి. నైట్ డ్యూటీ చేసే మహిళా వైద్యులుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. కోల్‌కతా జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలి.

-ఇ.నాగదేవి, వైద్యురాలు, పీహెచ్‌సీ, కాతేరు

కాపాడమన్ను స్వామీ

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అనర్థం
- మట్టి విగ్రహాలే సురక్షితం
- పర్యావరణ రక్షణకు ఊతం


అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

ధవళేశ్వరం: విఘ్ననాయకా భజే.. అంటూ ఆ స్వామిని కొలిచే వేడుక సమీపిస్తోంది.. మరికొద్ది రోజుల్లోనే ఆ ఘట్టం రానుంది. ఈ సంబరాల్లో మట్టి గణనాథుడిని పూజించాలనే నినాదం అందరి చోటా వినిస్తోంది. అయితే చాలా చోట్ల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నిలబెడుతుండడంతో పర్యావరణానికి విఘాతంగా మారుతోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు మార్కెట్‌లోని రావడంతో మట్టి విగ్రహాల తయారీదారులకు డిమాండ్ తగ్గింది. ధవళేశ్వరం కుమ్మరి వీధిలో సుమారు 50 కుటుంబాల వరకూ మట్టి పాత్రలు, కుండీలు, కుండలు, అలంకరణ సామగ్రి, వినాయక, తదితర విగ్రహాలు తయారు చేసేవారు. వీటికి డిమాండ్ తగ్గిన నేపథ్యంలో మట్టి విగ్రహాలనూ కొనకపోవడంతో వీటిపైనే ఆధారపడి జీవించే కుమ్మర్లు తీవ్ర ఆర్థిక ఒడిదొడుకులకు గురయ్యారు. దశాబ్ద కాలంగా వీటిపైనే ఆధారపడి జీవించే కులవృత్తుల వారు ఇతర పనులకు మళ్లారు. ఇప్పుడు సుమారు 15 కుటుంబాలే నేటికీ వీటినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయి. తమకు మంచి రోజులు వస్తాయని ఆశతో ఎదురు చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణపై ఇటీవల కాలంలో ప్రజల్లో వచ్చిన చైతన్యంతో గత ఏడాది కొంత మంది తిరిగి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను కాదని మట్టి విగ్రహాల వైపు మళ్లారు. ఈ ఏడాది మట్టి విగ్రహాల కొనుగోలుదారులు మరింత పెరుగుతారన్న ఆశాభావంతో మట్టి విగ్రహాలను వారు తయారీ చేస్తున్నారు.

తక్కువ ధరకే విక్రయాలు



గణనాథుని మట్టి విగ్రహాలకు ఈ ఏడాది డిమాండ్ ఉంటుందని ఆశిస్తున్నాం. గత రెండు నెలలుగా కుటుంబం మొత్తం విగ్రహాలను తయారు చేస్తున్నాం. తక్కువ ధరకే విగ్రహాలకు విక్రయిస్తున్నాం. చాలా వరకూ ఇప్పుడు మట్టి విగ్రహాలు కావాలని అడుగుతున్నారు.

-వి.ప్రసాద్, మట్టి విగ్రహాల తయారీదారుడు, ధవళేశ్వరం

ఇవే మా జీవనాధారం



మట్టి విగ్రహాలు, పాత్రలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. గణనాథుని విగ్రహాలు, దీపావళి ప్రమీదల సమయంలో డిమాండ్ ఉంటుంది. గత ఏడాది మట్టి విగ్రహాల వినియోగం తిరిగి పెరిగింది. ఈ ఏడాది మరింత పెరుగుతుందని భావిస్తున్నాం.

-డి.గురులింగం, మట్టి విగ్రహాల తయారీదారుడు, ధవళేశ్వరం

పర్యావరణానికి పెద్దపీట వేద్దాం

వినాయక చవితి ఉత్సవాల్లో సాధ్యమైనంత వరకూ మట్టి గణనాథుని విగ్రహాలు వినియోగించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. కెమికల్స్ ఉపయోగించి తయారు చేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అదే విధంగా మట్టి విగ్రహాల కొనుగోలు ద్వారా చేతివృత్తుల వారిని ప్రోత్సహించినట్లు ఉంటుందని పేర్కొంటున్నారు.

అందుబాటు ధరల్లో..

వినాయక చవితి సందర్భంగా పూజల్లోకి వినియోగించే మట్టి గణనాథుని విగ్రహాలను ప్రతి ఒక్కరికి అందుబాటు ధరలో ఉన్నాయి. రూ.12 నుంచి రూ.14 వరకూ ఈ విగ్రహాలను విక్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో పలు స్వచ్ఛంద సంస్థలు సైతం ముందుకు వచ్చి మట్టి గణనాథుని విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తుండటంతో ప్రజల్లో కూడా వీటిపై అవగాహన పెరిగింది. ఈ ఏడాది డిమాండ్ బాగుంటుందన్న ఉద్దేశంతో భారీగా మట్టి విగ్రహాలు తయారు చేసి అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు.

ఎస్‌కేవీటీ కళాశాలకు న్యాక్ బి గ్రేడ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలను ఈ నెల 13, 14 తేదీల్లో న్యాక్ కమిటీ సందర్శించి కళాశాలకు గ్రేడ్-బి ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మెరుగైన గ్రేడ్ సాధించడం ఆయా విభాగాల అధిపతుల చేసిన సమష్టి కృషికి నిదర్శనమన్నారు. కొన్ని నెలల ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో అనుకున్న లక్ష్యాన్ని అధిగమించామని తెలిపారు. ఇక్కడ చదివిన ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో నిలిచారని చెప్పారు. తెలుగు శాఖ చేసిన కృషిని న్యాక్ కమిటీ ప్రశంసించిందన్నారు. తాజాగా నెక్ ×బి≈ గ్రేడ్ గుర్తింపు రావడంతో విద్యార్థులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. కళాశాల అభివృద్ధికి తనపై మరింత బాధ్యత పెరిగిందని ప్రిన్సిపాల్ అన్నారు. శనివారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రేడ్ ×బి≈ని సాధించినందుకు విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

యాజమాన్య పద్ధతులతో లాభాలు


సమావేశంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మధురపూడి: ఆయిల్‌పామ్ సాగులో యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.దుర్గేష్ అన్నారు. శనివారం గాదరాడ ఓం శివశక్తి పీఠంలో జిల్లా ఉద్యాన శాఖ, పెద్దాపురానికి చెందిన పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌ఫామ్ తోటల విస్తరణ మహోత్సవం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా దుర్గేష్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో 28 వేల మంది రైతులు 19,383 హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్‌ఫామ్ సాగు చేస్తున్నారన్నారు. దీనిని మరింత విస్తృతం చేసేందుకు కార్యాచరణను చేపట్టినట్టు తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో బిందు సేద్యం పద్ధతుల ద్వారా మరింత ప్రయోజనాలు పొందవచ్చన్నారు. అలాగే నాణ్యమైన దిగుబడిని సాధించడంతో పాటు, డ్రిప్ ద్వారా ఎరువులందిస్తే కూలీల ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ సందర్భంగా 32 హెక్టార్లలో విస్తీర్ణంలోని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి సంబంధించి ఆయా రైతులకు పామాయిల్ మొక్కలను పంపిణీ చేశారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి బి.సుజాతకుమారి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు జిల్లాలోని ఈ ప్రాంతాలు అనువుగా ఉన్నాయన్నారు. పలువురు రైతులు సాగులో ఎదురవుతున్న కష్టాలను వివరించారు. కోతుల బెడద కారణంగా గెలలు నాశనం అవుతున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, పంతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థకు చెందిన అధికారులు, కోరుకొండ ఉద్యాన శాఖ మండలాధికారి పి.రినీ పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

రంగంపేట: రహస్యంగా పేకాడుతున్న నలుగురు వ్యక్తుల్ని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ తోట కృష్ణసాయి శనివారం తెలిపారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో రహస్యంగా పేకాడుతున్నట్టు తమకు సమాచారం అందడంతో తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. దాడిలో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, రెండు బైక్‌లు, రూ.1,000 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

రేపటి నుంచి వేదసభలు

సీటీఆర్ఐ: వేదనాదంతో గోదావరి తీరం మార్మోగనుంది. ఏటా శ్రావణ మాసంలో జరిగే వేదసభలకు రంగం సిద్ధమైంది. వేదశాస్త్ర పరిషత్తు 88వ వార్షిక వేదసభ ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి ప్రాంగణంలో జరుగుతుంది. పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టా ప్రదానం, పండిత సత్కారం జరుగుతాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీఎస్ఎస్ విభీషణశర్మ, మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, ఎస్పీ నరసింహకిశోర్ పాల్గొంటారు.

మరిన్ని సభలు ఇలా..

స్థానిక కళాగౌతమి ఆధ్వర్యంలో డాక్టర్ బీవీఎస్ మూర్తి నిర్వహించే వేదసభ సోమవారం మధ్యాహ్నం 1 గంటకు గౌతమఘాట్‌లోని జగద్గురు పీఠంలో జరుగుతుంది. వేద పండితులు, విద్యార్థులను నిర్వాహకుడు బీవీఎస్ మూర్తి సత్కరిస్తారు. అలాగే భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న విశ్వనాథ జగన్నాథ ఘనపాఠి పేరిట ఆయన తనయుడు, మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ ఏటా నిర్వహించే వేద సభ సోమవారం సాయంత్రం 6 గంటలకు గోదావరి గట్టున ఉన్న శృంగేరీ శారదాశంకర మఠంలో జరుగుతుంది. శ్రీకొంపెల్ల సుబ్బరాయశాస్త్రి వేదశాస్త్ర పరిషత్ నవమ వార్షిక మహాసభ ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఆర్యాపురం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతుంది. రాష్ట్రపతి పురస్కారగ్రహీత విశ్వనాథ గోపాలకృష్ణ అధ్యక్షత వహించే ఈ సభను సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కొంపెల్ల సూర్యనారాయణ, కొంపెల్ల సత్యనారాయణ నిర్వహించనున్నారు. బ్రహ్మశ్రీ రేమెళ్ల సూర్యప్రకాశ శాస్త్రి వేదశాస్త్ర చారిటబుల్ పరిషత్తు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు పద్మావతీ కల్యాణ మండపం (వాడ్రేవువారి సత్రం)లో జరుగుతుంది.

జక్కంపూడి రాజాకు అభినందనలు


జక్కంపూడి రాజాను అభినందిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ శనివారం రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సరైన సమయంలో సరైన బాధ్యతలు అప్పగించారన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు జక్కంపూడి రాజా సమర్థవంతమైన సేవలు అందిస్తూ యువజన విభాగం పటిష్టతకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక, జిల్లా మైనార్టీ నాయకుడు ఆరిఫ్, ఇన్నీసుపేట అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ గుత్తుల భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఫ్యూచర్ కిడ్స్ విద్యార్థుల ప్రతిభ


కర్రి కుష్వంత్ రెడ్డి


సమ్రీన్‌కౌర్ ఆనంద్


యర్రంశెట్టి మోక్షామాలిని

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని ది ఫ్యూచర్ కిడ్స్ విద్యార్థులు అఖిల భారత స్థాయి నీట్ ర్యాంకులు సాధించి, అత్యుత్తమ మెడికల్ కళాశాలల్లో సీట్లను పొందారని పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి తెలిపారు. విద్యార్థులు కర్రి కుష్వంత్ రెడ్డి మద్రాస్ మెడికల్ కళాశాల (చెన్నై), సమ్రీన్‌కౌర్ ఆనంద్ సవితా మెడికల్ కళాశాల (చెన్నై), యర్రంశెట్టి మోక్షామాలిని శ్రీరామ్ మెడికల్ కళాశాల(చెన్నై)లో సీట్లు సాధించారన్నారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, చైర్‌పర్సన్ యేలేటి విజయ, సీఈఓ మహస్వియేలేటి, డీన్ హర్షిణి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, వైస్ ప్రిన్సిపాల్స్ సైదాభాను, శ్రీవల్లి తదితరులు అభినందించారు.

కాలుష్య రహిత సమాజానికి కృషి చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి సునీత, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శ్రీవేంకటేశ్వర ఆనంకళా కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ, ఆర్థిక వ్యవస్థ పట్ల సుస్థిరం, వనరుల సామర్థ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యర్థ పదార్థాల నిర్వహణలో రీసైక్లింగ్ కీలకమైన అంశమన్నారు. చెత్త నియంత్రణ ఇంటి నుంచే ప్రారంభం కావాలని, అప్పుడే గ్రామ, పట్టణ ప్రాంతాలు శుభ్రంగా ఉంటాయన్నారు. ప్రతి రోజూ చెత్తను శుభ్రపరుస్తూ పట్టణాన్ని అందంగా ఉంచుతున్న శానిటేషన్ కార్మికులకు మనం ఎంతో రుణపడి ఉన్నామన్నారు. రాజమహేంద్రవరంలో ఒక ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్య సమస్యను నియంత్రించాలంటూ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని కోరారు. న్యాయపరంగా ఎటువంటి సమస్యలున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని అన్నారు. సెప్టెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ మార్గం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ శానిటేషన్ ప్రక్రియ సమాజ బాధ్యతని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తను వేరు చేసి ఇస్తే శానిటేషన్ సిబ్బందికి సులభంగా ఉంటుందన్నారు. ప్లాస్టిక్‌తో కూడిన ఇతర వ్యర్థాలను కాలువల్లో వేయడం వల్ల మురుగు పారుదలకు అడ్డంకి మారుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్, మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ


వరద సుబ్బారావు సమకూర్చిన ప్రోత్సాహకాలను విద్యార్థులకు అందజేసిన డీఈఓ వాసుదేవరావు

కడియం: స్థానిక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, పులిచింతల ప్రాజెక్టు సబ్ కలెక్టర్ వరద సుబ్బారావు తన తల్లిదండ్రుల పేరిట 25 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. ఈ మేరకు శనివారం స్థానిక హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ కె.వాసుదేవరావు మాట్లాడుతూ వరద ఫౌండేషన్ పేరిట సుబ్బారావు చేస్తున్న సేవలను అభినందించారు. కడియం తహసీల్దార్ కె.పోశయ్య మాట్లాడుతూ తామంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఈ స్థాయిలో ఉన్నామన్నారు. కార్యక్రమానికి హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షత వహించగా కోలా సత్యనారాయణ, ఎంపీడీఓ రత్నకుమారి తదితరులు మాట్లాడారు. గత ఏడాది పదో తరగతిలో టి.హేమ మండల ప్రథమ స్థానం సాధించగా ఆమె తల్లిని, మండల ద్వితీయ స్థానం సాధించిన జక్కల భానుప్రకాష్ తల్లిని ఘనంగా సత్కరించి నగదు బహుమతులను అందించారు. గత ఏడాది పదో తరగతిలో 500 మార్కులు దాటిన విజయలక్ష్మి, జోషిత, ఫరీదా, డానియల్ పాల్ తదితర 17 మందికి రూ.2 వేలు, రూ.1500 వందలు చొప్పున నగదు, ప్రశంసా పత్రం, మెడల్స్ అందించారు. 6 నుంచి 9 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు పి.శ్రీనివాస్, చంద్రశేఖర రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు. తన తల్లి పేరిట ప్రోత్సాహకాలు అందించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణను, హెచ్ఎం టి.సత్యనారాయణలను డీఈఓ వాసుదేవరావు సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ అత్యవసర పనుల నిమిత్తం ఆదివారం పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ శనివారం ప్రకటించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కలిగే అంతరాయంతో రాయుడుపాకలు, కొలమూరు, కొంతమూరు గ్రామంలోని పరిమినగర్, బొమ్మన కాలనీ, ఫోర్త్ బ్రిడ్జి ఏరియా, కల్యాణ్ నగర్, ఆదర్శనగర్, నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లింపేట, ఎంప్లాయీస్ కాలనీ, జంగాల కాలనీ, పంచాయతీ ప్రాంతం, బ్రాహ్మణ అగ్రహారం, సాయిరాం కాలనీ, శేషాద్రి లేఅవుట్, క్వారీ ఏరియా, కంటిపూడి లేఅవుట్, 14 ఎకరాల లేఅవుట్, బీసీ కాలనీ, భవానీపురం ఏరియా, కాతేరులోని శాంతినగర్, తిరుమల కళాశాల ప్రాంతం, జీఎస్ఆర్ ఆన్‌లైన్, పంచాయతీ ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందన్నారు.

వెలుగులు తెచ్చారు..


చీకటిగా మారిన రత్నంపేట వాంబే గృహాలకు వెళ్లే రోడ్డు


వీధి దీపాలు ఏర్పాటు చేసిన తర్వాత..


సాక్షి ఇంపాక్ట్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 42వ డివిజన్ రత్నంపేట వాంబే గృహాలకు వెళ్లే దారిలో రెండు నెలలుగా విద్యుత్ దీపాలు వెలగడం లేదు. రాత్రయితే చీకట్లో ప్రజలు అవస్థలు పడతున్నారు. దీనిపై రెండు నెలలుగా వెలగని వీధి దీపాలు అనే శీర్షికన శనివారం 'సాక్షి' దినపత్రికలో వార్త వచ్చింది. దీనికి నగరపాలక సంస్థ సిబ్బంది స్పందించారు. శనివారం పాడైన లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

కడియం: దుళ్లలో పశు వైద్యశాల, రైతు భరోసా కేంద్రాలను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శనివారం ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల: డబుల్ ఇస్మార్ట్
సూర్యమినీ: ఏలియన్
సూర్యప్యాలెస్: డిమోంటీకాలనీ-2
స్వామి: డిమోంటీకాలనీ-2
అశోక: ఆయ్
శివజ్యోతి: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
అనుశ్రీ: కమిటీ కుర్రోళ్లు
రాజా: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
రంభ: ఇంద్ర
ఊర్వశి: తంగలాన్
మేనక: రేవు, స్త్రీ-2
కుమారి: ఏలియన్, పరాక్రమం
అప్సర: మిస్టర్‌బచ్చన్
నామవరం:
వీఎస్.మహల్: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం, ఆయ్
ధవళేశ్వరం:
మురళీకృష్ణ: ఆయ్
కడియం:
వెంకటసూర్య: తంగలాన్, ఆయ్